ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 15-01-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

ముఖ్యాంశాలు

- భారత్ విస్తరణ ధోరణితో కాకుండా అభివృద్ధి స్ఫూర్తితో పనిచేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.
- ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో గత రెండు రోజులుగా జరుతున్న మహాకుంభమేళా ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది.
- భారత దేశ వృద్ధికి పునాది సమ్మిళిత్వంలో ఉందని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ పేర్కొన్నారు.
- ఇటీవల జరిగిన 2024 సార్వత్రిక ఎన్నికలపై మెటా సీయీవో మార్క్ జుకర్ బర్గ్ చేసిన వ్యాఖ్యలపై ఆ సంస్థ క్షమాపణలు చెప్పింది.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమం ఈనెల 19వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ విస్తరణ ధోరణితో కాకుండా అభివృద్ధి స్ఫూర్తితో పనిచేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ముంబైలోని నేవల్ డాక్ యార్డ్ లో యుద్ధ నౌకలు ఐఎన్ఎస్ సూరత్, ఐఎన్ఎస్ నీలగిరి, జలాంతర్గామి ఐఎన్ఎస్ వాగ్షీర్ ను ప్రధానమంత్రి ఈరోజు ప్రారంభించి జాతికి అంకితం చేశారు. అనంతరం జరిగిన సభలో ప్రసంగిస్తూ... ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ శరవేగంగా అడుగులు వేస్తోందన్నారు. తయారీ ఎగుమతి సామర్థ్యాలు కూడా నిరంతరం పెరుగుతున్నాయని రాబోయే సంవత్సరాల్లో భారతదేశానికి వందల సంఖ్యలో కొత్త నౌకలు అవసరమవుతాయని అన్నారు. ఈ నేపథ్యంలో పోర్టు ఆధారిత అభివృద్ధి నమూనా మన ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వబోతోందని వేల సంఖ్యలో కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించబోతున్నామని నరేంద్ర మోడీ మాట్లాడుతూ ....

(వాయిస్ బైట్.. 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో గత రెండు రోజులుగా జరుతున్న మహాకుంభమేళా ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. దీనిలో భాగంగా 10 దేశాల నుండి 21 మంది విదేశీ సభ్యుల ప్రతినిధి బృందం రేపు త్రివేణీ సంగమంలో పవిత్ర స్నానం చేయనున్నారు.భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆహ్వానించిన ప్రతినిధి బృందం ఇప్పటికే ప్రయాగ్ రాజ్ చేరుకుంది. కాగా ఇప్పటివరకూ సుమారు పది కోట్ల మంది భక్తులు త్రివేణీ సంగమంలో పుణ్య స్నానాలాచరించారని అధికారులు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

'ఫాస్ట్ ట్రాక్ ఇమ్మిగ్రేషన్ - ట్రస్టెడ్ ట్రావెలర్ ప్రోగ్రామ్'ను రేపు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రారంభించనున్నారు. ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్, కొచ్చిన్, అహ్మదాబాద్ విమానాశ్రయాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఇది ప్రయాణీకులకు ప్రపంచ స్థాయి ఇమ్మిగ్రేషన్ సౌకర్యాలను అందిస్తుంది. అంతర్జాతీయ ప్రయాణాన్ని అంతరాయం లేకుండా నిర్దేశిత ప్రాంతాలకు సురక్షితంగా చేరుస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ వృద్ధికి పునాది సమ్మిళిత్వంలో ఉందని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ పేర్కొన్నారు. ఛత్తీస్ గఢ్ లోని బిలాస్ పూర్ లో ఈరోజు జరిగిన గురు ఘాసీదాస్ విశ్వ విద్యాలయం 11వ స్నాతకోత్సవం సందర్భంగా ఉపరాష్ట్రపతి నూతనంగా నిర్మించిన భవనాలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులనుద్దేశించి ప్రసంగిస్తూ ఇప్పుడు యువతరం ఏమైనా చేయగలం అనే ఒక వైఖరితో నిండి ఉందని వారి ఆలోచనలను ఫలవంతం చేయడానికి ఈ వైఖరి ఉపకరిస్తుందని అన్నారు. మన సాంస్కృతిక వారసత్వం నాగరికతల సారాంశం సమ్మిళిత్వమని 140 కోట్ల మంది జనాభా ఉన్న దేశంలో అభివృద్ధి చివరి మైలు వరకూ చేరుకుంటోందన్నారు. జనాభాలోని ప్రతి విభాగం ఈ పరిణామాల నుండి ప్రయోజనం పొందుతున్నారని వివరిస్తూ...

(వాయిస్ బైట్.. 37 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశంలో ఇటీవల జరిగిన 2024 ఎన్నికలపై మెటా సీయీవో మార్క్ జూకర్ బర్గ్ చేసిన వ్యాఖ్యలపై మెటా ఇండియా క్షమాపణలు చెప్పింది. ఈ వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున వివాదం చెలరేగిన నేపథ్యంలో ఆ సంస్థ భారత ప్రతినిధి క్షమాపణలు చెప్పారు. దీనిని అనుకోకుండా జరిగిన పొరపాటుగా చూడాలన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మానవాళికి సేవ చేయాలనే మన సంస్కృతికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం సామాజిక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు.ఒకరోజు మహారాష్ట్ర పర్యటనలో భాగంగా నవీ ముంబైలోని ఖార్ఘర్‌లో ఇస్కాన్ ప్రాజెక్ట్ అయిన శ్రీ రాధా మదన్మోహన్ జీ ఆలయాన్ని ప్రారంభించారు. అనంతరం సభలో మాట్లాడుతూ భారతదేశం ఒక శక్తివంతమైన భూమి అని భారతదేశాన్ని అర్థం చేసుకోవాలంటే ముందుగా ఆధ్యాత్మికతను సమీకరించుకోవాలని అన్నారు. మన ఆధ్యాత్మిక సంస్కృతికి పునాది మానవాళికి సేవ చేసే స్ఫూర్తి అని దానికి అనుగుణంగా, కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్, హర్ ఘర్ జల్ మరియు ఉజ్వల యోజన వంటి సామాజిక సంక్షేమ పథకాలను అమలు చేసిందని ఆయన అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ సైనిక దినోత్సవాన్ని ఈరోజు పూణేలోని బాంబే ఇంజనీర్స్ గ్రూప్ సెంటర్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని దేశంలోని ఇతర ప్రాంతాలకు తీసుకురావాలని నిర్ణయం తీసుకున్న తర్వాత, ఢిల్లీ వెలుపల ఆర్మీ డే పరేడ్ జరగడం ఇది మూడవసారి. సదరన్ కమాండ్ ఆధ్వర్యంలో కమాండ్ వార్ మెమోరియల్ వద్ద పుష్పగుచ్ఛం ఉంచడంతో ఈ కవాతు ప్రారంభమైంది. ఆర్మీ స్టాఫ్ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది దేశం కోసం అత్యున్నత త్యాగం చేసిన ధైర్య సైనికులకు ఈ సందర్భంగా నివాళులర్పించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ CISF కి చెందిన రెండు కొత్త రిజర్వ్ బెటాలియన్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో మొత్తం బెటాలియన్ల సంఖ్యను 13 నుంచి 15కి చేరింది. ఒక్కో కొత్త బెటాలియన్‌లో దాదాపు వెయ్యి ఇరవై మంది ఉంటారని హోం మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఐదుగురు వివిధ స్థాయిల సిబ్బందితో పాటు ఒక సీనియర్ కమాండెంట్ స్థాయి అధికారి నేతృత్వంలో ఈ బెటాలియన్ ఉంటుంది. ఈ కొత్త బెటాలియన్లు అంతర్గత భద్రతకు సంబంధించిన తక్షణ అవసరాలను తీర్చడానికి శిక్షణ పొందిన సిబ్బందిని అందిస్తాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దట్టమైన పొగమంచు కారణంగా ఢిల్లీ రాజధాని పరిసర ప్రాంతాల్లో భారత వాతావరణ శాఖ (IMD) ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ రోజు ఉదయం 9 గంటలకు ఢిల్లీలో దృశ్యమానత జీరో మీటర్లకు తగ్గిపోయింది. దీంతో ఢిల్లీకి వెళ్లే 26 రైళ్లు నాలుగు గంటల వరకు ఆలస్యంగా నడుస్తున్నాయని భారతీయ రైల్వే తెలిపింది. వీటిలో గోరఖ్‌ధామ్ ఎక్స్ ప్రెస్, సంపర్క్ క్రాంతి ఎక్స్ ప్రెస్, శ్రమ శక్తి ఎక్స్ ప్రెస్, మహాబోధి ఎక్స్ ప్రెస్, అయోధ్య ఎక్స్ ప్రెస్, తెలంగాణ ఎక్స్ ప్రెస్, గోండ్వానా ఎక్స్ ప్రెస్ లు ఉన్నాయి. అదే విధంగా దేశ రాజధానిలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో తక్కువ దృశ్యమానత కారణంగా అనేక విమానాలు కూడా ఆలస్యమయ్యాయి. ఇదిలా ఉండగా పంజాబ్, హర్యానా, బీహార్, జార్ఖండ్, ఒడిశాతో సహా దేశంలోని ఈశాన్య ప్రాంతాలలో ఈ రోజు రాత్రి, రేపు ఉదయం వేళల్లో దట్టమైన పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. వచ్చే మూడు రోజుల్లో మధ్య భారతదేశంలో కనిష్ట ఉష్ణోగ్రతలు 2 నుండి 3 డిగ్రీల సెల్సియస్ వరకు పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 118వ సంచిక ఈనెల 19వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్కు ఈనెల 17వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్-ఐర్లాండ్ మధ్య జరుగుతున్న మూడు వన్డేల సిరీస్ ను భారత మహిళా జట్టు కైవసం చేసుకుంది. గుజరాత్‌లోని రాజ్‌కోట్ వేదికగా ఈరోజు జరిగిన చివరి మ్యాచ్ లో భారత్ రికార్డు స్థాయిలో 435 పరుగులు చేసింది. లక్ష్య సాధనలో ఐర్లాండ్ మహిళా జట్టు 131 పరుగులకే ఆలవుట్ అయ్యింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =